16052025-MAI-04_Layout 1 5/16/2025 2:30 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# ఆడబిడ్డలకు అవమానం

**తెలంగాణ** చారిత్రక వారసత్వ సంపదకు ప్రతీక రామప్ప ఆలయం. అక్కడి స్తంభాలపై చెక్కిన మహిళల శిల్పాలు అద్వితీయమైన స్థానిక సంస్కృతికి అద్దం పడుతాయి. వివిధ సామాజిక వర్గాలకు చెందిన వనితల రూపురేఖా విన్యాసాలు ఆ బొమ్మల్లో శాశ్వతత్వం సంతరించుకున్నాయి. ఆలయంలోని అణువణువూ అపురూపమైన ఉద్గ్రంథమే. అంతటి మహత్తర శిల్పవాటిక సాక్షిగా తెలంగాణ ఆడపడుచులకు అవమానం జరిగింది. అతిథి మర్యాదల్లో చోటుచేసుకున్న 'అతి'కి ఈ గడ్డ ఆత్మగౌరవం చితికిపోయింది. 'యాల్ల గాని యాల్ల బూపాలం' పాడినట్టు కాంగ్రెస్ సర్కార్ తలపెట్టిన అందాల పోటీలు అకాల వర్షాలను తలపిస్తున్నాయి.

ఓ వైపు తీవ్రాతి తీవ్రమైన ఉగ్రదాడిని తిప్పికొట్టే ప్రయత్నాల్లో భారత రక్షణ దళాలు నిరంతర అప్రమత్తతతో నిమగ్నమై ఉన్నాయి. ఒకరకంగా ఇది జాతికి పరీక్షా సమయం. ఎప్పుడు, ఎక్కడ ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని శాంతిభద్రతల యంత్రాంగం కండ్లల్లో వత్తులు వేసుకుని పహారా కాస్తున్నది. మరోవైపు రాష్ట్రం ప్రకృతి బీభత్సాలతో అతలాకుతలం అవుతున్నది. అకాల వర్షాలు సృష్టించిన విధ్వంసంతో రైతన్నలు ఆగమాగమయ్యారు. వానలు, వరదలు చేతికందిన ధాన్యాన్ని తడిపేసి గుండెకోతను కలిగిస్తున్నాయి. నిన్నటిదాకా కల్లాలు, నేడు కొనుగోలు కేంద్రాలు.. అంతే తేడా. మొదటిది పూర్తిగా ప్రకృతిపరమైన శాపం. రెండోది మాత్రం సర్కారు నిర్లక్ష్యం ఫలితమే. సకాలంలో కాంటా వేసి లెక్క తేల్చకుండా సర్కారు చోద్యం చూస్తున్నది. కొనుగోళ్ల సమస్య రైతుల ఉసురు తీస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వంలో చలనం రావడం లేదు. ఆ సంగతి అలా ఉంటే సందట్లో సడేమియా అన్నట్టు అందాల పోటీల పేరిట జరుపుతున్న అనవసరమైన హంగామా సర్కారు ప్రాధాన్యాలను ఎత్తిచూపుతున్నది. 420 హామీలు గాలికెగిరిపోయాయి. అవ్వలకు పింఛన్ల పెంపు లేదు. ఆడబిడ్డలకు పెండ్లి ఖర్చుల జాడే లేదు. తులం బంగారం కలలో మాటే. భరోసా ఉత్తమాటే అయ్యింది. 'యువతకు ఉద్యోగాలు కల్పన'గానే మిగిలిపోయాయి. ఉద్యోగులకు జీతాల పెంపుపై ఊరడింపు దక్కలేదు. పాలన పడకేసింది. ప్రగతి ముఖం చాటేసింది.

గల్లీ నుంచి ఢిల్లీ దాకా కనీవినీ ఎరుగని కల్లోల పరిస్థితుల్లో దేశం అట్టుడికిపోతున్నది. అయినా ప్రభుత్వానికి అర్జెంటుగా అందాల పోటీలు కావలసి వచ్చాయి. ఈ పోటీలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ఏ మాత్రం సరిపడవని మహిళా సంఘాలు గొంతెత్తి చాటినా అది చెవిటి సర్కారు చెవిలో శంఖమూదడమే అయ్యింది. అసమర్థత, అవినీతితో కుళ్లి కంపు కొడుతున్న సర్కారు అందాల పోటీలతో అత్తరు అద్దుకోవాలని చూస్తున్నట్టు కనిపిస్తున్నది. బుల్డోజర్ల అండతో సాగిస్తున్న భూ దాహానికి సర్వోన్నత న్యాయస్థానం పెడుతున్న చివాట్లతో సర్కారుకు చీమకుట్టినట్టయినా అనిపించడం లేదు. అందాల పోటీల మిరుమిట్లతో సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించాలని చూస్తున్నది. సుందరీమణుల ప్రతిభా పాటవాల మాటేమో గానీ ఈ నేల గరిమకు అవి పరీక్షలు పెడుతున్నాయి. ఈ వైపరీత్యం రోజురోజుకూ శృతిమించుతున్నది. రామప్ప సాక్షిగా సుందరీమణుల కాళ్లను తెలంగాణ ఆడబిడ్డలతో కడిగించడం ఓ పరాకాష్ఠగా నిలుస్తున్నది. తెలంగాణ సోయి లేని చేతకాని పాలకుల చేతుల్లో మన 'లచ్చుమమ్మ'లు చిన్నబోయే పరిస్థితి రావడం దురదృష్టకరం.



# లొసుగుల ఊబిలో..



కన్నోజు శ్రీహర్ష
89851 30032

**భారత్- పాకిస్థాన్ మధ్య ఇటీవల జరిగిన పరిణామాలు యావత్ ప్రపంచం మన వైపు చూసేలా చేశాయి. ఆపరేషన్ సింధూర్ వల్ల భారత ఆర్మీ పరాక్రమాన్ని, మన ఆయుధ సంపత్తిని చూసి ప్రపంచం ఆశ్చర్యపోయింది. అదే సమయంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) రూ.8,400 కోట్ల నిధులు ఇవ్వడం విస్మయానికి గురిచేసింది.**

ఐఎంఎఫ్ విధానాలు కొన్ని దేశాల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నాయి. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఐఎంఎఫ్ విధిస్తున్న ఆర్థిక కట్టుబాట్లు ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీసేలా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పశ్చిమ దేశాల ఐడియాలజీతో ఐఎంఎఫ్ పని చేస్తున్నదనే ఆరోపణలు వస్తున్నాయి. ఋణ భారంతో బాధపడుతున్న దేశాలకు ఖర్చులు తగ్గించే దిశగానే ఐఎంఎఫ్ సలహాలు ఉంటాయి. దీని వల్ల సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వాలు తగ్గించాల్సి వస్తున్నది. ఇది ప్రజల జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతున్నది. శ్రీలంక, అర్జెంటీనా వంటి దేశాల్లో ఇది స్పష్టంగా కనిపించింది.

కొన్ని దేశాలకు ఆర్థిక సంస్థలు ఇస్తున్న రుణాల్లో సింహభాగం ఉగ్రవాద సంస్థలకు వెళ్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) అనే సంస్థ గతంలో హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఉగ్రవాద చర్యలను కట్టడి చేయాలని ప్రపంచ దేశాలు తీవ్రంగా ప్రయత్నిస్తుంటే ఐఎంఎఫ్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు తాజాగా భారీగా నిధులు సమకూర్చడం ఆ సంస్థ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ప్రపంచీకరణ తర్వాత బ్రెజిల్, భారత్, జర్మనీ, జపాన్, చైనా లాంటి దేశాలు అమెరికాతో ఆర్థికంగా పోటీ పడుతున్నాయి. ఈ తరుణంలో ఐఎంఎఫ్ రుణాలపై ఎవరూ ఆధారపడటం లేదు. కొన్ని మిత్ర దేశాలు కలిసి ఐఎంఎఫ్‌కు పోటీగా ఆర్థిక సంస్థలను నెలకొల్పుతున్నాయి. బ్రిక్స్ బ్యాంకు ఆసియాలోని దేశాలతో పాటు ఇతర దేశాలకు రుణాలు ఇస్తున్నది. ఐఎంఎఫ్ లాంటి సంస్థలకు దీటుగా ఏఐఐబీ, బ్రిక్స్ బ్యాంకులు పనిచేస్తున్నాయి.

ఐఎంఎఫ్ తాజా చర్యల నేపథ్యంలో భారతదేశం తన అంతర్జాతీయ విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అమెరికా ద్వంద్వ వైఖరి, చైనా దూకుడు, పాక్ ఉగ్రవాద ప్రోత్సాహం నేపథ్యంలో భారత్ ఆర్థికంగా పుంజుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇందులో భాగంగా దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి. తద్వారా అమెరికాపై ఆధారపడాల్సిన ఆవశ్యకత తగ్గుతుంది. అదే సమయంలో పశ్చిమ దేశాల విషయంలో తటస్థ వైఖరిని పాటించాలి. ఆర్థిక నిపుణుల సూచనల మేరకు విదేశాంగ విధానాన్ని మనకు లాభం చేకూర్చే విధంగా రూపొందించుకోవాలి.

# ఒకే దేశం.. రెండు ఆపరేషన్లు



డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**పహల్గాంలో దాడి చేసిన ఉగ్రవాదులను మట్టుబెట్టాలన్న లక్ష్యంతో మొదలైన ఆపరేషన్ సిందూర్ నాలుగు రోజుల తర్వాత ఇరుదేశాల కాల్పుల విరమణతో ముగిసింది. కానీ, భారతదేశంలో మావోయిస్టులుగా మారిన మన దేశ పౌరులను నిర్మూలించడానికి భారత ప్రభుత్వం మొదలుపెట్టిన 'ఆపరేషన్ కగార్' మాత్రం ఇంకా ముగియలేదు. దండకారణ్యం నేటికీ నెత్తురోడుతూనే ఉన్నది. దీన్ని ఆపవచ్చు, ఆపాలి కూడా. వరంగల్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లక్షలాది మంది ప్రజల సమక్షంలో ఇదే మాట చెప్పారు.**



ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వేలమందితో బయల్దేరి వెళ్తుండగా హుజూరాబాద్ ప్రాంతంలో వలంటీర్ల సాయంతో ఆగిపోయిన వాహనాలను క్లియర్ చేస్తున్న క్రమంలో కొంతమంది మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు నన్ను కలిశారు. 'మీరు మమ్మల్ని నాడు రక్షించకపోతే మేమెప్పుడో కనుమరుగయ్యేవాళ్లం. నేడిలా ఉండేవాళ్లం కాద'ని ఎంతో ఉద్వేగంతో చెప్పారు.

వీరు.. రెండు దశాబ్దాల కిందట నేను కరీంనగర్ ఎస్పీగా పనిచేస్తున్న కాలంలో హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రాంతంలో తలపెట్టిన పరివర్తన సదస్సుల వల్ల మిలిటెంట్ కార్యకలాపాలు మానేసి ఆయుధాలు, అడవిని వీడి జనజీవన స్రవంతిలో కలిసినవారే. నాడు ఎల్కతుర్తి, హుస్నాబాద్, సైదాపూర్, కోహెడ, చిగురుమామిడి, ఇల్లంతకుంట జమ్మికుంట ప్రాంతాలకు చెందిన అనేకమంది సాయుధులైన నక్సలైట్ల కుటుంబాలను నేను స్వయంగా కలిశాను. ప్రభుత్వ ప్రోత్సాహంతో వారిని జనజీవన స్రవంతిలో కలిపేలా, రక్తపాతం జరగకుండా పలు కార్యక్రమాలను నాడు చేపట్టాం. వారితో చర్చించి, వారి సమస్యలను అర్థం చేసుకొని, వారికి అవసరమయ్యే సహకారాన్ని అందించి, ఒప్పించి తమంతట తామే లొంగిపోయేలా ఎలా కృషి చేశామో నాటి రోజులు నా కండ్లముందు మెదిలాయి.

సరిగ్గా 22 ఏండ్ల తర్వాత ఏప్రిల్ 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగిస్తూ.. 'ఆపరేషన్ కగార్' పేరుతో జరుగుతున్న హింసను ఆపాలని, మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాలని ప్రకటించడం నిజంగా చరిత్రాత్మకం. కర్రెగుట్టలో గత నెల రోజులుగా కేంద్రం చేస్తున్న ఆపరేషన్ కగార్ మన దేశ పౌరులపై మన కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిన యుద్ధం. దేశంలో ప్రజాస్వామికవాదులు, హక్కుల నేతలు, మేధావులు, బుద్ధిజీవులు, ప్రతిపక్ష నాయకులు కూడా ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తున్నారు. అయినా కేంద్రం పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయాలను అమలుచేస్తూ అడవిలో చిక్కుకున్న మావోయిస్టులను ఏ అవశేషాలు లేకుండా మట్టుబెట్టాలని మొండిగా వ్యవహరిస్తున్నది. హింస ఏ రూపంలో ఉన్నా అడ్డుకోవాలి. అంతేకానీ, హింసను హింస ద్వారానే (అదీ మన పౌరులపై) ముగించాలనుకోవడం సరైనది కాదు. యుద్ధం వద్దని, చర్చలకు పిలవాలని, ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆలోచించాలని ప్రత్యర్థి కోరిన తర్వాత కూడా యుద్ధమే చేయాలనుకోవడం ఆమోదయోగ్యం కాదు. ఇది మన బిడ్డలను మనమే చంపుకొంటున్నామనడానికి ఉదాహరణ.

నేను సుమారు పదేండ్ల పాటు బెల్లంపల్లి, వరంగల్, కరీంనగర్, అనంతపురం వంటి దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఐపీఎస్‌గా పనిచేశాను. ఆ సమయంలో నక్సలైట్లు, మిలిటెంట్లుగా అడవిలో ఉన్నవారు, ఈ రోజు చాలామంది రాజకీయ నాయకులుగా, వ్యాపారవేత్తలుగా, ఉద్యోగులుగా, వ్యవసాయదారులుగా సమాజంలో గౌరవంగా బతుకుతున్నారు. వీరిని తెలంగాణ ఉద్యమం కూడా చాలా ప్రభావితం చేసింది. కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో పర్యటించిన ప్రతీసారి చాలామంది మిత్రులు కలిసి ఈ విషయాన్ని నాతో పంచుకుంటుంటారు. అయితే ఇది అంత సులువుగా సాధ్యం కాలేదు.

> **ప్రాణాలకు తెగించి, అడవిలో నక్సలైట్లు ఉన్నచోటుకే వెళ్లి, వారిని కలిసి, మాట్లాడి ఒప్పించడం అంటే మాటలు కాదు. అలాంటి ప్రయత్నాల్లో కొన్నిసార్లు కాల్పులు కూడా జరిగాయి. ఇరువైపులా ప్రాణాలు పోయాయి. ఈ విధంగా ప్రయత్నించిన నాలాంటి చాలా మంది అధికారులు వారికి టార్గెట్‌గా మారారు. కుటుంబాలతో సహా భారీ మూల్యం నేటికీ చెల్లించుకుంటూనే ఉన్నాం.**

వాస్తవానికి చాలామంది మావోయిస్టులు రాజ్యంపై యుద్ధం చేయడానికో లేదా రాజ్యాన్ని ఓడించాలనే లక్ష్యంతోనో అడవిబాట పట్టలేదు. వ్యక్తిగతంగా ఎదుర్కొన్న అవమానాలు, వ్యవస్థలో ఉన్న లోపాలను చూసి బాధింపబడినవారు, భూస్వాముల ఆగడాలు, వివక్షను సహించనివారు, అధికారుల దోపిడీని, దౌర్జన్యాలను ఓర్వలేనివారు సిద్ధాంతం పట్ల ఆకర్షితులై వెళ్తారు. అడవిలో ఉన్న వారికి కూడా తెలుసు వారు రాజ్యాన్ని ఓడించలేరని, అదంత సులువు కాదని. కానీ, వెళ్లిన తర్వాత తిరిగివచ్చే అవకాశం లేక అక్కడే చిక్కుకుపోతారు. నక్సలైట్లు, మిలిటెంట్లకు లొంగిపోయే అవకాశం కల్పించి, ప్రతిభ ఆధారంగా వారికి సహాయం లేదా ఉపాధి కల్పించి, పోలీసు వేధింపులను ఆపి, అవసరమైతే వ్యవసాయ భూమిని కూడా ఇచ్చే వెసులుబాటు కల్పిస్తే వారు కచ్చితంగా జనజీవన స్రవంతిలో కలిసేందుకు అంగీకరిస్తారు.

> **పదేండ్ల పాటు నేను పని చేసిన అటవీ ప్రాంతాల్లో ప్రభుత్వాలు, అధికారులు చేసింది సరిగ్గా ఇదే. హుస్నాబాద్, హుజూరాబాద్, కరీంనగర్, వేములవాడ, వరంగల్, ములుగు వంటి ప్రాంతాల్లో, 2002 కాలంలో చావుకు భయపడకుండా అడవుల్లోకి వెళ్లి వారిని, వారి కుటుంబాలను కలిసి 'అజ్ఞాతం-స్వేచ్ఛ', 'పరివర్తన సదస్సు', 'నిమజ్జనం' వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా సాయుధులైన నక్సలైట్లకు జీవనాధారం చూపి, వారికి కావాల్సిన సహకారం అందించి వేల మందిని లొంగిపోయేలా చేసి, జనజీవన స్రవంతిలో మేము కలుపగలిగాం. అంతేకాదు, దేశంలోనే మొదటిసారిగా దాదాపు వంద మందికి పైగా మిలిటెంట్లు ఆయుధాలతో సహా ప్రభుత్వం ముందు లొంగిపోయేలా కృషిచేశాం.**

2004లో వరవరరావు, హరగోపాల్, కన్నాబిరాన్ వంటి మేధావులతో ఏర్పడిన పీస్ కమిటీ (కమిటీ ఆఫ్ కన్సర్న్‌డ్ సిటిజన్స్) సూచన మేరకు ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపింది. అవి సఫలమయ్యాయి. కానీ, ఒప్పందం ప్రకారం మావోయిస్టులు ఆయుధాలు విడువకపోవడంతో యథావిధిగా ప్రజాకోర్టులు పెట్టి చట్టాన్ని తామే చేతుల్లోకి తీసుకోవడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఇపుడు కూడా ఒకవైపు మావోయిస్టులు శాంతి మంత్రం జపిస్తూనే, మరోపక్క మందు పాతరలతో పోలీసులను మట్టుపెట్టడం వంటి ఘటనలు విమర్శలకు తావివ్వడమే కాకుండా, వారి చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తుంది. ఇలాంటి చర్యలు తిరిగి ప్రతిపాదిత చర్చల విఫలానికి దారితీసే ప్రమాదం ఉన్నది.

ప్రస్తుతం మావోయిస్టులే చర్చలకు పిలవాలని కోరుతున్నారు. ఒప్పందం కుదుర్చుకోవడానికి సిద్ధమంటున్నారు. కాబట్టి భారత ప్రభుత్వం ఆలోచించాలి. అవసరమైతే ఒక మెట్టు దిగిరావాలి. ఎందుకంటే మావోయిస్టులు కూడా ఈ దేశ బిడ్డలే. ఇదేమీ ఇండియా-పాకిస్థాన్, రష్యా- ఉక్రెయిన్, ఇజ్రాయిల్-పాలస్తీనా దేశాల మధ్య యుద్ధం కాదు. కాబట్టి ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి. నక్సలైట్లను చర్చలకు ఆహ్వానించాలి. వారికి మాట్లాడే అవకాశం ఇవ్వాలి. మనుషులను చంపుకొంటూపోతే యుద్ధం ముగియదని గ్రహించాలి. చంపితే మనుషులే చస్తారు తప్ప, భావజాలం చావదని తెలుసుకోవాలి. మేధావులు, ఉద్యమకారులు, ప్రొఫెసర్లు, రిటైర్డ్ అధికారులు, ప్రతిపక్ష పార్టీల సలహాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. నక్సలైట్లకు ఉన్న అనుమానాలు, అవసరాలు, వారి భావాలు, బాధలను కూడా అర్థం చేసుకోవాలి. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. అడవుల్లో ఉన్న అరుదైన, విలువైన సహజ వనరుల దోపిడీ కోసం నక్సలైట్ల ఏరివేత మొదలెట్టారని, వారితో పాటు అమాయక ఆదివాసీలను కూడా నిర్దాక్షిణ్యంగా చంపుతున్నారని, మహిళలపై లైంగికదాడులు చేస్తున్నారనే వాదనలకు జవాబివ్వాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వంపై ఉన్నది.

మావోయిస్టులు కూడా ఆయుధాలన్నీ ఒకచోట పెట్టి లేదా మూడో పక్షానికి అప్పగించి చర్చలకు హాజరై సంపూర్ణ, శాశ్వత పరిష్కారం చూపే మార్గాలను ఆలోచించాలి. తిరిగి ఆయుధాలు ముట్టుకోబోమని హామీ ఇవ్వాలి. అవసరమైతే ప్రజాస్వామ్యబద్ధంగా పేదల పక్షాన నిలబడి కొట్లాడే హక్కు రాజ్యాంగం ప్రకారం ఉందని గుర్తుచేసుకోవాలి. భారత రాజ్యాంగం ఆయుధాలు చేతబట్టడాన్ని ఒప్పుకోదని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని గ్రహించాలి. నేపాల్‌లో జరిగిన విధంగా ఒప్పందం కుదుర్చుకోవాలి. ఇందుకు కేంద్రమే పెద్దన్న పాత్ర పోషించాలి. దోపిడీ లేని సమాజ నిర్మాణం కోసం పనిచేస్తామని ప్రభుత్వమే హామీ ఇవ్వాలి. మూలాల్లోకి వెళ్లి వినూత్నమైన పరిష్కార మార్గాలను అన్వేషించాలి. లొంగిపోయినవారికి హోంగార్డులుగా, విలేజ్ వలంటీర్లుగా కో ఆర్డినేషన్ కమిటీలు ఏర్పాటుచేసి సమాజ మార్పు కోసం వారి సేవలను వినియోగించుకుంటామని హామీ ఇవ్వాలి. భూమి, ఆర్థిక సాయం కూడా అందించాలి. గతంతో పోల్చి చూస్తే ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల్లో రోడ్డు సౌకర్యాలు మెరుగయ్యాయి. ఇంటర్‌నెట్ వాడకం పెరిగింది. వంతెనల నిర్మాణాలు జరిగాయి. కాబట్టి మావోలు కూడా ఆలోచించి సరెండరవ్వాలి. వివక్ష, దోపిడీ, అన్యాయానికి వ్యతిరేకంగా నిరాయుధులుగా రాజ్యాంగబద్ధంగా సమాజ మార్పు కోసం కృషిచేస్తామని మాటివ్వాలి.

దోపిడీ, దౌర్జన్యం, వివక్ష, అణచివేత, అన్యాయం లేని విధంగా, దేశం సర్వతోముఖాభివృద్ధి చెందేలా కేంద్రం పాలించాలి. ఎందుకంటే దోపిడీ, అసమానతలు ఉన్నంతకాలం ప్రజలు ఆత్మగౌరవంతో బతుకలేరు. కాబట్టి తిరిగి మిలిటెంట్ పోరాటాలకు దారితీసే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ తదితర బీజేపీ నాయకులు బాధ్యతారహితమైన ప్రకటనలు చేస్తూ.. మానవీయ, రాజ్యాంగ విలువలు లేకుండా మాట్లాడటం మానుకోవాలి. శత్రువునైనా సరే చంపడం ద్వారా మార్చాలనుకోవడం సరికాదు. ప్రతి వ్యక్తి అభిప్రాయాన్ని గౌరవించాలి, చర్చించాలి, వాదోపవాదాలతో వారి మార్గం సరైంది కాదని నిరూపించాలి.


2026 మార్చి 31లోపు నక్సలిజాన్ని అంతం చేస్తామని కేంద్రం చెప్తున్నది. అంతమంటే మనుషులను చంపడం కాదు, భావజాలంపై చర్చ జరగాలి. మనుషులే చనిపోతారు, భావజాలం చావదు, ఇది తాత్కాలిక పరిష్కారం మాత్రమే. ఏ సమస్యనైనా పరిష్కరించాలంటే, దాని మూలాల్లోకి వెళ్లాలి. అప్పుడే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ముందు ఈ దేశ సమస్యలపై, సామాజిక అసమానతలపై, వివక్షపై లోతైన విశ్లేషణ జరగాలి. ప్రజలంతా సమానమేనన్న భావన ప్రజలందరికీ కలగాలి. అందుకు ఒక తేదీ పెట్టుకొని అంతం చేస్తామంటే కుదరదని గ్రహించాలి.

> **ప్రజాస్వామ్య దేశం ఎప్పుడూ తన సొంత బిడ్డలను చంపుకోదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అఫ్తాబ్ ఆలం చెప్పిన విషయాన్ని ప్రభుత్వం అర్థం చేసుకొని, ఆచరించాలి. సీనియర్ అధికారులు, మేధావులు, జర్నలిస్టులు చొరవ తీసుకోవాలి. అందరూ ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తూ దేశాభివృద్ధికి కృషి చేసి, నెత్తుటి మరకలు లేని దేశంగా కాపాడుకోవాలి.**

ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులపై భారత సైన్యం దాడులు జరుపుతున్న సమయంలోనే, మరోవైపు పాక్ అధికారులతో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ చర్చలు జరిపారని తెలిసిందే. చివరికి భారీ నష్టం జరగకుండా ఇరు దేశాలు కాల్పుల విరమణ ప్రకటించాయి. రెండు దేశాల రక్షణ, పౌరుల భద్రత దృష్ట్యా చర్చలు జరిపి ఒప్పందం కుదుర్చుకోవడం శుభపరిణామం. అయితే మన శత్రు దేశంతోనే చర్చలు జరిపి ఒప్పందం చేసుకోగ లేనిది, మన దేశంలో అంతర్గతంగా జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి చర్చలు జరిపితే కేంద్ర ప్రభుత్వానికి జరిగే నష్టం ఏమిటి? దేశ సరిహద్దులో మరణించినా, కర్రెగుట్టలో మరణించినా అందరూ మన దేశ పౌరులే కదా! కర్రెగుట్టలో చర్చలకు తావివ్వకుండా చంపుకొంటూ, పక్క దేశంతో ఒప్పందం కుదుర్చుకోవడం చూస్తే, మన దేశ ప్రజల పట్ల మన ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతున్నది.

శాంతి చర్చలు, ఒప్పందం వల్ల రెండు దేశాల మధ్య యుద్ధాన్నే ఆపగలిగినప్పుడు అవే ఒప్పందాలు, శాంతి చర్చలు జరిపి మన దేశంలో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను ఆపలేమా? ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని వీడి ప్రజల ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేయాలి. దేశంలోని అన్ని పార్టీల నాయకులతో చర్చించి ప్రధాని, కేంద్ర హోంశాఖ దీనిపై నిర్ణయం తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను కూడా సేకరించి మెజారిటీ ప్రజల అభిప్రాయాన్ని అమలు చేయాలి. తద్వారా దండకారణ్యంలో శాశ్వతంగా శాంతిని నెలకొల్పాలి.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు)




## ఆవిష్కరణ

**మరువం-** చర్చా వేదిక, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 2025 మే 16న శుక్రవారం సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి మినీ హాల్‌లో ప్రముఖ సంగీత విద్వాంసులు, వయోలిన్ కళాకారులు, విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల పూర్వ అధ్యక్షులు డాక్టర్ ద్వారం దుర్గాప్రసాదరావు రచించిన సంగీత, సాహిత్య వ్యాసాల విశిష్ట సంపుటి 'జీవాళి' ఆవిష్కరణ, చర్చా కార్యక్రమం జరుగుతుంది.

•మరువం-చర్చా వేదిక

లేఖ



# ఆత్మాభిమానం తాకట్టు

**తెలంగాణ ప్రభుత్వం అందాల పోటీల పేరిట ఆర్భాటం చేస్తూ, హడావుడి సృష్టిస్తున్నది. ఇందులో భాగంగా మన ఆడబిడ్డల ఆత్మాభిమానం, స్వాభిమానంతో ఆటలాడుతున్నది. బుధవారం నాడు రేవంత్‌రెడ్డి సర్కార్ మన ఆడబిడ్డలతో ప్రపంచ సుందరాంగుల పాదాలను కడిగించడం హేయమైన చర్య. రాణిరుద్రమదేవి, సమ్మక్క-సారక్క వంటి ధీర వనితలు ధిక్కార స్వరం వినిపించిన ఓరుగల్లు వేదికగా మన ఆడబిడ్డలను అవమానించడం అత్యంత ఖండనీయం. ఈ చర్యను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీకి మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి లేఖ రాశారు. ఆ లేఖ పూర్తి పాఠం.**

*గౌరవనీయులైన శ్రీమతి సోనియాగాంధీ గారికి,*

నాలుగున్నర కోట్ల ప్రజలకు అంతులేని దుఖాన్ని కలిగించి న ఒక విషయాన్ని మీ దృష్టికి తీసుకురావడానికి తెలంగాణ ఆడపడుచులమైన మేము ఈ లేఖ రాస్తున్నాం. దశాబ్దాల పాటు సాగిన తెలంగాణ పోరాటం, అసంఖ్యాక అమరవీరుల త్యాగం గురించి మీకు తెలుసు. అయితే, మీ పార్టీకి చెందిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గారు మిస్ వరల్డ్ పోటీదారుల కాళ్లు కడిగి, తుడిచే పనులకు తెలంగాణ మహిళలను ఉపయోగించడం అత్యం త దుర్మార్గమైన చర్య. ఇది బానిస మనస్తత్వాన్ని ప్రదర్శించే చర్యగానే తెలంగాణ సమాజం భావిస్తున్నది. తెలంగాణ ఆడబిడ్డల స్వాభిమానాన్ని అందాల పోటీదారుల పాదాల చెంత ఉంచి తెలంగాణ సంస్కృతిని అవమానించడం క్షమించరాని నేరం. మా తెలంగాణ ఆడపడుచులతో విదేశీ మహిళల కాళ్లు కడిగించడం మా రాష్ట్ర ప్రజల మనసును తీవ్రంగా బాధించింది. ఇలాంటి పనులు మహిళా సాధికారత పేరిట జరగడం దారుణం. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి మహిళను, ప్రతి కుటుంబాన్ని ఈ ఘటన తీవ్రంగా కలిచివేస్తున్నది. రేవంత్‌రెడ్డి చర్యలు తెలంగాణ సంప్రదాయాలను అవమానించడమే కాక, ప్రపంచం ముందు మా నేల ఖ్యాతిని మంటగలిపాయని తీవ్ర ఆవేదనతో తెలియజేస్తున్నాం.

తెలంగాణ ఆడపడుచులు ఈ నేల స్వాభిమానానికి నిదర్శనం. వయసుతో సంబంధం లేకుండా ఆడబిడ్డల కాళ్లు మొక్కడం ఈ నేల సంప్రదాయం. తన కూతుళ్లను ఈ గడ్డ ఎంతలా గౌరవిస్తుందో చెప్పడానికి ఈ సంప్రదాయమే నిదర్శనం. అలాంటి మా ఆడబిడ్డలతో విదేశీ మహిళల కాళ్లు కడిగించడమనేది రేవంత్ వికృత వ్యక్తిత్వానికి సాక్ష్యం. రేవంత్ చర్యలు తెలంగాణ స్ఫూర్తిని అర్థం చేసుకోలేని అజ్ఞానాన్ని, ఎవరినో సంతోషపెట్టడానికి ఈ నేల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే దాస్య మనస్తత్వాన్నే చూపిస్తాయి. రజాకార్ల, దొరల దౌర్జన్యం అయితేనేమీ, ఉమ్మడి ఏపీలో అనుభవించిన వివక్ష అయితేనేమీ, అణచివేత ఏ రూపంలో ఉన్నా ఈ నేల నిరంతరం ప్రతిఘటిస్తుంది. తెలంగాణ ఉద్యమం అనేది రాష్ట్ర ఏర్పాటు కోసమే కాదు, ఇది మా ఆత్మగౌరవాన్ని చాటడానికి, మా సంస్కృతిని కాపాడుకోవడంతో పాటు మా తెలంగాణ బిడ్డల సాధికారత కోసం జరిగిన మహాపోరాటం అన్న సంగతి గుర్తెరగాలి.

ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం గళమెత్తిన ఆశావర్కర్లపై కాంగ్రెస్ ప్రభుత్వం సాగించిన దుశ్శాసన పర్వాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ మరిచిపోదు. మా సోదరి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ముఖ్యమంత్రే స్వయంగా నిండు సభలో ఘోరంగా అవమానించారు. అంతేకాకుండా, బెటాలియన్ పోలీసుల భార్యలు తమ భర్తలకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా సచివాలయం ముందు నిరసన తెలిపినప్పుడు, వారిపై కూడా అత్యంత కిరాతకంగా జులుం ప్రదర్శించారు. మహిళా జర్నలిస్టులను 'బట్టలు ఊడదీసి కొడతాం' అని బెదిరించడం.. ఈ ఘటనలు రేవంత్‌రెడ్డి మహిళా వ్యతిరేక, నియంతృత్వ ధోరణులకు సాక్ష్యాలు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న వికృత సంస్కృతికి ప్రతిబింబాలు.

> **సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో దళిత, గిరిజన ఆడబిడ్డలపై పోలీసులు అర్ధరాత్రి జరిపిన అకృత్యాలను సాటి మహిళలుగా మేం ఎన్నటికీ మరిచిపోలేం. ఆ బాధిత మహిళలకు న్యాయం దక్కాలన్న ఉద్దేశంతో ఢిల్లీలోని మహిళా కమిషన్, మానవహక్కుల కమిషన్ వరకు వెళ్లి మేం పోరాడాం. ఆ సంస్థలు తప్పుబట్టినా రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇంకా బుద్ధి రాలేదు. వస్తుందన్న నమ్మకం రాష్ట్రంలో ఎవరికీ లేదు.**

మేడమ్, గత 17 నెలలుగా రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని మీ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి, రాష్ట్ర ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని కాలరాస్తూ, అడుగడుగునా తెలంగాణ స్వాభిమానాన్ని దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్నది. ఎన్నికల సమయంలో మహిళల సంక్షేమం కోసం గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ పార్టీ అనేక వాగ్దానాలు చేసింది. మహాలక్ష్మి పథకం కింద ప్రతీ మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని, ప్రతీ విద్యార్థినికి స్కూటీ ఇస్తామని రకరకాల హామీలిచ్చింది. ఏడాదిన్నర గడిచినా ఈ హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి. రేవంత్‌రెడ్డి ఈ వాగ్దానాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారు. తద్వారా తెలంగాణ మహిళలను దారుణంగా మోసం చేశారు. ఓవైపు తెలంగాణ దివాలా తీసిందని, ఖజానా పూర్తిగా ఖాళీ అయిపోయిందని, అప్పుల కోసం వెళ్తే దొంగను చూసినట్టు చూస్తున్నారని తన చేతకానితనాన్ని బయటపెట్టుకున్న ముఖ్యమంత్రి.. మరోవైపు అందాల పోటీల కోసం ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేయడం తెలంగాణ మహిళలను మాయమాటలతో మోసం చేయడమేనని తేలిపోయింది. ఇలాంటి ఆర్భాటాల కోసం రూ.200 కోట్లు వెచ్చించడం కంటే, ఆ మొత్తాన్ని మహిళల సంక్షేమం, విద్య, ఉపాధి కోసం ఉపయోగించి ఉంటే రాష్ట్ర ఆడబిడ్డలకు నిజమైన గౌరవం దక్కేది.

మాకు బాగా గుర్తుంది. తెలంగాణ ఏర్పడినప్పుడు 'ఇది ఆత్మగౌరవానికి సంకేతంగా నిలవాలి' అని మీరు ఆకాంక్షించారు. ప్రతినిత్యం ఆడబిడ్డల ఆత్మాభిమానంతో ఆటలాడుతున్న ముఖ్యమంత్రిని ఇంకా వెనకేసుకొస్తారా అనేది కాంగ్రెస్ పార్టీ తేల్చుకోవాలి. ఈ సర్కారు చర్యలు అధికార దుర్వినియోగం, మహిళల పట్ల ఉన్న చులకనభావాన్ని ప్రతిబింబిస్తాయి. తెలంగాణ తల్లులు, అక్కచెల్లెమ్మల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ... తెలంగాణ మహిళలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నది.

**- సబితాఇంద్రారెడ్డి,** ఎమ్మెల్యే, మాజీ మంత్రి
**- వాకిటి సునీతాలక్ష్మారెడ్డి,** ఎమ్మెల్యే
**- కోవ లక్ష్మి,** ఎమ్మెల్యే
**- సత్యవతి రాథోడ్,** మాజీ మంత్రి